నేడు వై.ఎస్.షర్మిల కడపకు రాక

ప్రజాశక్తి - కడప

ఎపిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేపట్టే చర్యలలో భాగంగా పిసిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిల గురువారం కడపకు రానున్నారని డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి పిలుపునిచ్చారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయ జ్యోతి మాట్లాడారు. ఈ పర్యటనలో జిల్లాలోని సమస్యలు తెలుసుకుని జిల్లా కాంగ్రెస్ బలోపేతానికి కార్యాచరణ రూపొందించి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పునర్వైభవానికి కృషి చేస్తారని చెప్పారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అహ్మదాబాద్ తీర్మానంలో పొందుపరిచిన పలు అంశాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లి గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. కడప నగరంలోని ఐఎంఎ హాలులో మధ్యాహ్నం 3 నుండి 5 గంటల వరకు నిర్వహించే సమావేశానికి అందరూ హాజరు కావాలన్నారు.

ఏడాది పాలనలో నిర్వేదమే!



- నెరవేరని సిఎం హామీలు..నిరాశలో ప్రజానీకం
- ప్రశ్నార్థకంగా రాజంపేట, ప్రొద్దుటూరు మెడికల్ కళాశాలలు
- కదలని వెలిగల్లు, శ్రీనివాసపురం, ఝరికోన ప్రాజెక్టులు
- సెయిల్ ఆధ్వర్యంలో 'ఉక్కు' ఏర్పాటులో వైఫల్యం
- కూటమి ఏడాది పాలనపై ఫోకస్...

జిల్లాలో కూటమి సర్కారు ఏడాది పాలనలో నిర్వేదం నెలకొంది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసిన నేపథ్యంలో కూటమి నాయకునిగా చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన తొమ్మిది రకాల హామీలు అమలుకు నోచుకోని నేపథ్యం నిరుత్సాహాన్ని కలిగిస్తోంది. ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాకు జీవనాడిగా పేరుగాంచిన సెయిల్ ఆధ్వర్యంలో కడప ఉక్కు పరిశ్రమ రాబట్టడంలో వైఫల్యం దగ్గర నుంచి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాల అమలు పురోగతి ప్రశ్నార్థకంగా మారింది. 2024 జూన్ 12న రాష్ట్రంలో కూటమి పాలన మొదలై ఏడాది గడుస్తున్న నేపథ్యంలో ప్రతిపక్ష నాయకుని హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాల అమలు తీరుతెన్నులపై ఓ అవలోకనం..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో కూటమి ఏడాది పాలన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సామెతను తలపిస్తోంది. పాలనలో ఎటువంటి పురోగతి లేకపోగా తిరోగమనంలో నడుస్తోంది. కొప్పర్తి నుంచి ఎంఎస్ఎంఇ, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని విజయవాడకు తరలించడం, ఎన్ఎస్‌డిపి కోర్టును తిరుపతికి తరలించడం, మదనపల్లి, పులివెందుల మెడికల్ కళాశాలలు ప్రారంభించడంలో విఫలం కావడం వంటి కార్యకలాపాలతో తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష నాయకుని హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన సుమారు తొమ్మిది రకాల ప్రధాన హామీల్లో ఏ ఒక్కటీ అమలుకు నోచుకున్న దాఖలాలు కనిపించడం లేదు. కడప, రాయచోటి పట్టణాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా కడప జిజిహెచ్ ఆస్పత్రిని జాతీయ వైద్య విజ్ఞాన సంస్థగా తీర్చిదిద్దుతానని హామీనిచ్చారు. ఏడాది గడిచినప్పటికీ సూపర్‌స్పెషాలిటీ, కేన్సర్ కేర్, సైక్రియాటిక్ ఆస్పత్రులకు ప్రొఫెసర్స్ దగ్గర నుంచి అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ సిబ్బంది, నర్సుల నియామకాలకు దిక్కు లేకుండా పోయింది. ప్రొద్దుటూరు, రాజంపేట ప్రాంతాల్లో మెడికల్ కళాశాలలు, రాయచోటిలో ప్రసూతి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్న హామీ ప్రస్తావనే మరిచిపోయారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ జిల్లా వాసి అయినప్పటికీ అటువంటి స్పృహే కలగక పోవడం శోచనీయం. రాయచోటి, రాజంపేట పట్టణాల్లో జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఎటువంటి వైఖరికి దారి తీస్తుందోనని ఆందోళన నెలకొంది. అన్నమయ్య జిల్లా నుంచి రాష్ట్ర మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి మండిపల్లి ఇలాఖాలోని చిన్నమండెంలో జూనియర్ కళాశాల, పాలిటెక్నికల్ కళాశాలల ఏర్పాటు చేస్తామని హామీలో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. రాయచోటి నియోజకవర్గ పరిధిలోని వెలిగల్లు, శ్రీనివాసపురం, ఝరికోన రిజర్వాయర్ల పెండింగ్ పనుల్ని పూర్తి చేస్తామని ఇచ్చిన హామీ ప్రశ్నార్థకంగా మారింది. రాయలసీమ జిల్లాలకు చదువు, నీళ్లు, మౌలిక వసతులు కల్పిస్తే రాయలసీమ కోనసీమగా మారుస్తామని, రాయలసీమను హార్టీ కల్చరల్ హబ్‌గానూ, ఫ్రూట్‌బాస్కెట్‌గా మారుస్తామనే హామీలు జిల్లా ప్రజల చెవుల్లో మార్మోగుతున్న సంగతిని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీల్లో కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడం ఒకటి. 2014 నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల వరకు కేంద్రంలోని ఎన్‌డిఎ సర్కారు ఫీజుబులిటీ పేరుతో దగా చేస్తూ వస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలోని సంకీర్ణ సర్కారు రాష్ట్రంలోని టిడిపి, జనసేన ఎంపీల మద్దతుపై ఆధారపడి మనుగడ సాగిస్తోంది. టిడిపి, జనసేన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి సెయిల్ ఆధ్వర్యంలో జిల్లాకు ఉక్కు పరిశ్రమను రాబట్టు కోవడంలో ఉద్దేశపూర్వకంగానే విఫలమైంది. సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై కేంద్రాన్ని ప్రశ్నించిన, నిలదీసిన పాపానికిపోని పరిస్థితి దాపురించడం దుర్మార్గం. ప్రయివేటు ఉక్కు కంపెనీలకు లాభసాటి అయినప్పుడు సెయిల్‌కు ఎందుకు లాభసాటి, ఫీజుబులిటీ కాదో నిలదీయాల్సిన అవసరం ఉంది. కనీస ప్రయత్నం చేయకుండా జెఎస్‌డబ్ల్యూ అనే ప్రయివేటు సంస్థ ఆధ్వర్యంలో సాగుతున్న ఉక్కు పరిశ్రమ పనులు ఏడాదిపాటు నిలిచిపోవడం ఆశ్చర్యాన్ని, ఆందోళనను కలిగిస్తోంది. కడపలో నిర్వహించిన మహానాడు బహిరంగసభలో జూన్ 12న ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభిస్తామని, 3,500 మందికి ఉపాధి లభిస్తుందని ప్రకటించి చేతులు దులుపుకోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. అమ్మఒడి, రైతుభరోసా ఆన్‌గోయింగ్ సంక్షేమ పథకాల పేర్ల మార్పునకు పరిమితం కావడం తీవ్ర విమర్శలకు ఆస్కారాన్ని కలిగించింది. ఫీజురియింబర్స్‌మెంట్ బకాయిలను పెండింగ్‌లో పెట్టి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుండడం తీవ్రమైన విమర్శలకు ఆస్కారాన్ని కలిగిస్తోంది.

టిడిపి ఎమ్మెల్యేలపై సర్వే?!

నలుగురిపై ఐవిఆర్ఎస్ ఆరా ప్రజాప్రతినిధుల్లో ఉలికిపాటు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని టిడిపి ఎమ్మెల్యేల పనితీరుపై నిర్వహించిన సర్వే ఉలికిపాటుకు గురిచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ఎమ్మెల్యేలు ఇష్టానుసారంగా దోపిడీ చేస్తున్నారని, ప్రజలకు అందుబాటులో ఉండడంలేదనే వార్తల నేపథ్యంలో టిడిపి అధిష్టానం అప్రమత్తమైనట్లు సమాచారం.ఈ నెల 12వ తేదీతో రాష్ట్రంలోని కూటమి సర్కారు ఏడాది పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో టిడిపి అధిష్టానం ఎమ్మెల్యేల పనితీరుపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు ఎమ్మెల్యేల పని తీరుపై ఐవిఆర్ఎస్ సర్వే నిర్వహించినట్లు ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉన్నారా లేరా, ఇసుక, మట్టి, ఇతర కార్యకలాపాల్లో జోక్యం చేసుకుంటున్నారా లేదా అనే కోణం ఫోన్‌లో ప్రజలను ప్రశ్నలు అడుగుతున్నట్లు సమాచారం. సర్వే సమాచారం ఆధారంగా వెనుకబడిన ఎమ్మెల్యేలను హెచ్చరించినట్లు సమాచారం.

మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన ప్రజాప్రతినిధులు మరింత బాధ్యతగా ఉండాలని సూచించినట్లు సమాచారం. వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్ సొంత జిల్లాయైన ఉమ్మడి కడప జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో పది మంది ఎమ్మెల్యేల్లో ఏడుగురు గెలుపొందడం తెలిసిన సంగతి తెలిసిందే. చారిత్రాత్మక గెలుపును సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో బాధ్యతగా మసలుకోవాలని హెచ్చరి ంచినట్లు ప్రచారం నడుస్తోంది. ఇంతటితో ఆగకుండా రాబోయే ఎన్నికల్లో గెలిచేవారెవరు, ఓడిపోయే వారెవరనే కోణంలోనూ ఆరా తీస్తున్నట్లు సమాచారం. ప్రజాప్రతినిధులు జాగరూకతతో ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని సుతిమెత్తంగా మందలించినట్లు వార్తలు ప్రచారంలో ఉన్నాయి. రాబోయే మంత్రివర్గంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు బెర్త్ ఖాయమని సోషల్‌మీడియాలో ప్రచారం హోరెత్తుతుండడం చర్చనీయాంశంగా మారింది.

డిఆర్‌ఒకు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

కడప, ప్రొద్దుటూరు ఎంఇఒలను సస్పెండ్ చేయాలి

డిఇఒకు వినతి పత్రం అందజేసిన యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ బదిలీలలో ప్రిఫరెన్షియల్ కేటగిరిలో కేటాయించాల్సిన స్థానాల కంటే అధికంగా కేటాయించి, బదిలీల చట్టం–2025ను ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా వ్యవహరించిన కడప, ప్రొద్దుటూరు మండల విద్యాశాఖాధికారులు గంగిరెడ్డి, సావిత్రమ్మను సస్పెండ్ చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. కడపలోని స్కౌట్ హాలులో విద్యాశాఖ నిర్వహిస్తున్న బదిలీల్లో ఎంఇఒలు వ్యవహరించిన తీరు వల్ల ఉపాధ్యాయులకు జరిగిన తీవ్ర నష్టాన్ని వివరిస్తూ బుధవారం కలెక్టరేట్‌లో డిఆర్ఒ ఎం.విశ్వేశ్వర నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన బదిలీల చట్టం–2025 ప్రకారం ప్రిఫరెన్షియల్ కేటగిరికి ఒక పాఠశాలలో 40 శాతానికి మించి పోస్టులు కేటాయించకూడదనే స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ కడప, ప్రొద్దుటూరు ఎంఇఒలు చట్టాన్ని బేఖాతారు చేస్తూ ప్రిఫరెన్షియల్ కేటగిరికి ఇష్టారాజ్యంగా పోస్టులు కేటాయించారన్నారు. ఎంఇఒల నిర్లక్ష్యం వల్ల దాదాపు పది మంది జనరల్ కేటగిరి ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి బదిలీల చట్టాన్ని ఉల్లంఘించిన కడప, ప్రొద్దుటూరు మండల విద్యాశాఖాధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు నష్టపోయిన ఉపాధ్యాయులకు తగు న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.న్యాయం చేయకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఎజాస్ అహ్మద్ పాల్గొన్నారు.

కర్నూలుపై కడప జట్టు విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్–19 వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా బుధవారం వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కర్నూలుప 8 వికెట్ల తేడాతో కడప జట్టు ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 50.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది. ఆ జట్టులోని మురారి హృదయ్ 66, విఖ్యాత్ 25 పరుగులు చేశారు. కడప జట్టులోని నాగ కుల్లాయప్ప అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 4 వికెట్లు తీసుకున్నాడు. కడప జట్టు బ్యాటింగ్ ప్రారంభానికి ముందు వర్షం కారణంగా అంపైర్లు ఓవర్లను కుదించారు. విజెడి పద్ధతి ప్రకారం 37 ఓవర్లలో 164 పరుగుల టార్గెట్‌ను నిర్ణయించారు. అనంతరం 164 పరుగుల విజయ లక్ష్యంతో విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 30.5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసి 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కడప జట్టులోని రోహిత్ వర్మ 68, రణధీర్ రెడ్డి 55 (నాటౌట్) పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని అశోక్ కుమార్ యాదవ్, భార్గవ్ చేరో ఒక వికెట్ తీసుకున్నారు.

కె ఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై మూడు వికెట్ల తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 47.3 ఓవర్లలో 240 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని భువనేశ్వర్ 63, మనోజ్ కుమార్ 43 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని భార్గవ్ మహేష్ 3, తోషిత్ యాదవ్ 2, మోహన్ 2, తేజ సాయి 2 వికెట్లు తీసుకున్నారు. నెల్లూరు జట్టు బ్యాటింగ్ ప్రారంభానికి ముందు వర్షం కారణంతో ఎంపైర్లు విజెడి పద్ధతి ప్రకారం మ్యాచ్‌ను 47 ఓవర్లకు కుదించి విజయ లక్ష్యాన్ని 224 పరుగులుగా నిర్ణయించారు. 224 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 35.5 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 224 పరుగులు చేసి 3 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని కారుణ్య ప్రసాద్ 50, మన్విత్ 44 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని సాయి ప్రతాప్ రెడ్డి 3, వీరారెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు.



తలపడుతున్న కడప, కర్నూలు జట్లు

ఆటపాటలకు ఇక సెలవు..

- నేటి నుంచి బడులకు పరుగులు
- పాఠశాలలు పునఃప్రారంభం
- స్టూడెంట్ కిట్లు సిద్ధం
- నేటి నుంచి తల్లికి వందనం అమలు
- ప్రకటించిన సిఎం చంద్రబాబు నాయుడు
- సచివాలయాలకు అర్హుల జాబితా

కిట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారులు

ప్రజాశక్తి - కడప అర్బన్

50 రోజుల వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆటలు.. పాటలు.. అమ్మమ్మ..నానమ్మ ఊర్లకు వెళ్లి హాయిగా గడిపేశారు. సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కాను న్నాయి. దీంతో విద్యార్థులు బడులకు పరుగులు పెట్టనున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు 1,892 ఉన్నాయి. మున్సిపల్ హైస్కూల్స్ 84, ఎయిడెడ్ స్కూల్స్ 66, మదరసాలు 5, ప్రయివేట్, అన్‌ఎయిడెడ్ స్కూల్స్ 769 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ స్కూల్స్‌లో 1,17,078 మున్సిపల్ పాఠశాలల్లో 14,448, ఎయిడెడ్ పాఠశాలల్లో 7,394, మదరసాల్లో 199, ప్రయివేట్.అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1,88,348 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మొత్తం 2,816 స్కూల్స్‌లో 3,27,467 మంది విద్యార్థులు ఉన్నారు. టీచర్లు 14,474 మంది ఉన్నారు. వీరంగా గురువారం నుంచి పాఠశాలల్లో ప్రత్యక్షం కానున్నారు.

కొన్ని చోట్లు శుభ్రంగా..మరికొన్ని చోట్ల అపరిశుభ్రంగా..

పాఠశాలలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ విషయంలో హెచ్ఎంలకు తెలుసు. పాఠశాలల పునఃప్రారంభానికి ఒకటి రెండు రోజుల ముందైనా పాఠశాలలు శుభ్రం చేయించే కార్యక్రమాన్ని చేపట్టాలి. కొన్ని పాఠశాలల్లో స్వీపర్లు శుభ్రం చేస్తుండగా..మరికొన్ని పాఠశాలల్లో అపరిశుభ్రత దర్శనమిస్తుంది. అసలే దేశంలో, రాష్ట్రంలో కరోనా కేసులు పెరిగిపోతున్న నేపథ్యంలో పాఠశాలల్లో శుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

స్టూడెంట్ కిట్లు సిద్ధం

విద్యార్థులు ప్రభుత్వం అందించే సర్వేపల్లి రాధకృష్ణన్ విద్యార్థి మిత్ర (ఎస్ఆర్‌కెవిఎం) కిట్లు సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలకు వీటిని తరలించారు. స్కూల్ ప్రారంభం రోజు నుంచే కిట్లు ఇచ్చేలా అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. పాఠ్యపుకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్, బ్యాగ్, బూట్లు, బెల్ట్ ఇవ్వనున్నారు.

ఒక పక్క పాఠశాలలు పునఃప్రారంభం...మరో పక్క ఎస్‌జిటిల బదిలీలు..

ఉపాధ్యాయుల బదిలీలు ఏ ప్రభుత్వమైనా పాఠశాలలు ప్రారంభం కాకముందే అంటే మే, జూన్ 10లోపు పూర్తి చేయాలి. 12వ తేదీ పాఠశాలల పునఃప్రారంభవుతున్న నేపథ్యంలో బదిలీ చేసిన పాఠశాలల్లో ఆ ఉపాధ్యాయుడు రిపోర్టు చేయాలి. రాష్ట్రంలో బలీల ప్రక్రియ ఇందుకు బిన్నంగా ఉంది. ఎస్‌జిటిల బదిలీలు ఈ నెల 10,11,12,13 వరకు కొనసాగనున్నాయి. 10న బదిలీల కౌన్సెలింగ్ సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైతే 11వ తేదీ ఉదయం వరకు కొనసాగింది. ఉపాధ్యాయులకు కంటిమీద కునుకులేకుండా చేస్తుంది. ప్రభుత్వం ఎందుకు ఇంత నిర్లక్ష్యం చేస్తుందని ఉపాధ్యాయులు, యూనియన్ నాయకులు వాపోతున్నారు.

ఉపాధ్యాయుల కొరత..మౌలిక వసతులు మృగ్యం

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. పాఠశాలల్లో మౌలిక వసతులు మృగ్యమయ్యాయి. ఈ విషయాలు ప్రభుత్వం తెలిసి కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంది. అధ్యాపకుల కొరత, మౌలిక వసతులు వెంటనే కల్పించాలి. అనేక పాఠశాలల్లో గదులు లేక విద్యా ర్థులు రేకుల కిందనో, చెట్లకిందనో కూర్చోవాల్సిన పరిస్థితి ఉంది. దీనిని కూటమి ప్రభుత్వం అధిగమించాలి. పాఠశాలలు తెరువక ముందే పుస్తకాలు, యూనిపామ్ విద్యార్థులకు అందించి ఉంటే ఉపయోగంగా ఉండేది.

- వీరపోగు రవి, జిల్లా కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ, కడప.

అన్ని ఏర్పాట్లు పూర్తి

పాఠశాలలు పునః ప్రారంభమయ్యే నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎస్‌జిటి ఉపాధ్యాయుల కౌన్సిలింగ్ 13వ తేదీ పూర్తవుతుంది. 15వ తేదీ వీరంతా వారి వారి ప్రదేశాల్లో జాయిన్ అవుతారు. మెగా డిఎస్‌సి ద్వారా ఖాళీలు కూడా భర్తీ అయితాయి. దీంతో పాఠశాలల్లో విద్యాభ్యాసం పరిపూర్ణంగా కొన సాగుతుంది. మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం వాడుతున్నారు. అన్ని పాఠశాలలకు స్టూడెంట్ కిట్ చేరాయి. ఉపాధ్యాయులు విద్యార్థులకు వీటిని అందిస్తారు.

- షంషుద్దీన్, డిఇఒ, కడప జిల్లా.

కొప్పర్తికే ఎంఎస్ఎంఇ!

కార్పొరేషన్ పేరిట రిజిస్ట్రేషన్ పూర్తి రూ.50 కోట్లతో భవన నిర్మాణాలు

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

కొప్పర్తి పారిశ్రామికవాడలో ఎంఎస్ఎంఇ పార్క్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఈమేరకు మంగళవారం ఎంఎస్ఎంఇ పార్క్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీకి చెందిన ఉన్నతాధికారి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రూ.202 కోట్ల వ్యయంతో కూడిన ఎంఎస్ఎంఇ పార్కు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయింది. దీంతో 2024 సెప్టెంబర్‌లో కొప్పర్తి పారిశ్రామికవాడలోని ఎంఎస్ఎంఇ పార్క్‌ను తరలిస్తూ కూటమి సర్కారు జీవో జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఒకవైపు జిల్లా వ్యాప్తంగా ఎంఎస్ఎంఇ తరలింపునకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసనలు వ్యక్తం కావడం, మరోవైపు కేంద్రం ఎంఎస్ఎంఇ తరలింపును అంగీకరించకపోవడంతో ఎంఎస్ఎంఇ తరలింపు ఆగిపోయింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో కూటమి సర్కారు కొప్పర్తిలోని 19.54 ఎకరాల విస్తీర్ణంలో రూ.250 కోట్లతో కూడిన ఎం ఎస్ఎంఇ పార్కు తరలింపు ఉపసంహరించుకుంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో తాజాగా రిజిస్ట్రేషన్ పూర్తి కావడంతో రూ.50 కోట్లతో కూడిన భవన నిర్మాణాలు, ఇంజినీరింగ్ నైపుణ్యాన్ని పెంచే పరికరాల ఏర్పాటు తదితర సదుపాయాల కల్పన ఊపందుకోనుంది. దీంతో రాయలసీమ జిల్లాల నుంచి గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపశమనం లభించనుంది. వీరితోపాటు ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులు చదివిన లక్షలాది మంది ఇంజినీరింగ్ యువతకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. వీరికి ఎంఎస్ ఎంఇ పార్కులో పారి శ్రామిక అవసరాలకు తగిన విధంగా సాంకేతిక విద్యలోని ఆధునిక శిక్షణా సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ఫలితంగా రాయల సీమలోని లక్షలాది మంది యువతకు ఉపాధికి భరోసా లభించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

మాట్లాడుతున్న ప్రొఫెసర్

కెఎస్ఆర్ఎం కళాశాల 8వ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - కడప అర్బన్

కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ 2021 – 2025 బ్యాచ్ వివిధ బ్రాంచీలలో విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు 8వ స్నాతకోత్సవాన్ని కళాశాల కెఒఆర్ఎం ఆడిటోరియంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇండియన్ సైంటిస్ట్ అండ్ ఫార్మర్ డైరక్టర్ ఎస్‌డిఎస్‌సి షార్, శ్రీహరి కోట, గవర్నమెంట్ ఆఫ్ ఇండియ పద్మశ్రీ డాక్టర్ ఎంవైఎస్ ప్రసాద్, డైరక్టర్ ఆఫ్ అకాడమిక్ ఆడిట్, జెన్‌టియు అనంతపురం ప్రొఫెసర్ దుర్గాప్రసాద్ ద్వారా పట్టభద్రులైన విద్యార్థినీ విద్యార్థులకు పట్టాలను అందజేశారు. బ్రాంచుల వారీగా టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.వైఎస్ ప్రసాద్ మాట్లాడుతూ మీ జీవితంలో తదుపరి అధ్యాయాన్ని ప్రారంభించడానికి, పట్టభద్రత అనేది అపరిమిత అవకాశాలకు, అనితర సాధ్యలకు ప్రారంభమని తెలిపారు. కళాశాల మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్. కందుల చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ జీవిత ప్రయాణానికి, రేపటి ప్రపంచానికి, ఆవిష్కరణలకు రాయబారులుగా, నాయకులుగా ఎదగాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివిఎస్ మూర్తి మాట్లాడుతూ ముఖ్యంగా కొత్త జాతీయ విద్యా విధానం 2020ను అమలు చేస్తూ కళాశాల ముందడుగు వేసిందని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల అధినేతలు వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ, ట్రెజరర్ కందుల రాజేశ్వరమ్మ, వైస్ చైర్మన్ కందుల మదన్ మోహన్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.ఎన్. ప్రసాద్, ప్రోగ్రామ్ కన్వీనర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎం.వి.రవి కిషోర్ రెడ్డి, వివిధ విభాగాధిపతులు, డీన్ లు, సిబ్బంది, కళాశాల బోధన, భోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే ఆపండి

ప్రజాశక్తి-కడప అర్బన్

స్టిక్కర్ పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేంకు స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే ఆపాలని సిపిఎం కడప నగర కార్యదర్శి రామ మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం మృత్యుంజయకుంటలో స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని స్టిక్కర్లను సిపిఎం నాయకులు ఇళ్లకు అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నేతలు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు బిగించబోమని ఇచ్చిన హామీ అమలుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. లోకేష్ పాదయాత్రలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని ఇచ్చిన పిలుపును మరిచిపోయారా అని ప్రశ్నించారు. కూటమి అధి కారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రజలపై రెండుసార్లు విద్యుత్ సర్‌ఛార్జీల భారం దాదాపు రూ.15,454 కోట్లు మోపారని, పేర్కొన్నారు. సెకి ఒప్పందాన్ని రద్దు చేయడానికి అవస రమైన క్లాజు ఉన్నదని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నా దాన్ని పరిగణలోకి తీసుకోకపోవడం సరైంది కాదన్నారు కార్యక్రమంలో సిపిఎం జిల్లా జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, కుమార్, స్వామి రెడ్డి, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రెండవ రోజూ కొనసాగిన బదిలీల కౌన్సెలింగ్

ప్రజాశక్తి- కడప అర్బన్ : సెకండరీ గ్రేడ్ టీచర్స్ బదిలీల కౌన్సిలింగ్ రెండవ రోజు కొనసాగింది. బుధవారం నగరంలోని శంకరాపురం స్కౌట్ హాలులో బదిలీల ప్రక్రియను డిఇఒ షంషుద్దీన్, ఉప విద్యాధికారి రాజగోపాల్ రెడ్డి పర్యవేక్షించారు. వర్షం కారణంగా బదిలీలకు వచ్చిన ఉపాధ్యాయులు కొంత అసౌకర్యానికి గురయ్యారు. ఆబదిలీల ప్రక్రియ ఆలస్యంగా కొనసాగడంతో ఏ రోజుకు ఆరోజు పూర్తి కావాల్సిన కౌన్సెలింగ్ మరసటి రోజు వరకు కొనసాగుతూ ఉంది. దీంతో ఉపాధ్యాయులు ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బుధవారం 351 నంబర్ నుంచి 850 వరకు కౌన్సెలింగ్ పూర్తికావాల్సి ఉంది. జిల్లావ్యాప్తంగా ఎస్‌జిటి తెలుగు ఉర్దూ ఉపాధ్యాయులు బదిలీలకు 2,301 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 8 సంవత్సరాలు సర్వీస్ పూర్తయి తప్పనిసరి బదిలీ కావలసినవారు 1410 మంది ఉన్నారు.

దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పావని

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్ట రీత్యా నేరమని కమలాపురం, ప్రొద్దుటూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు ఎల్.పావని, శేఖర్‌రెడ్డి తెలిపారు. శిశు సంక్షేమ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం బాల కార్మికులను గుర్తించేందుకు మండల కేంద్రంలోని దుకాణాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పావని, శేఖర్ రెడ్డి మాట్లాడుతూ బాల కార్మికులను పనిలో పెట్టుకోకూడదన్నారు. నిబంధనలు అతిక్రమించి పిల్లలను పనిలో పెట్టుకుంటే యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్ రద్దు చేసి కేసు నమోదు చేస్తామన్నారు. ఒక దుకాణంలో బాల కార్మికున్ని గుర్తించి సంబంధిత యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ జి.మహేష్, ముద్దనూరు సచివాలయం మహిళా పోలీసులు ఆకాంక్ష, శివజ్యోతి, ఎన్‌జిఒ ప్రతినిధి రవి పాల్గొన్నారు.

బాబు ఏడాది పాలనలో ఏమున్నది గర్వకారణం..!

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో గర్వకారణం ఏమున్నదో సిఎం చంద్రబాబు చెప్పాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి ప్రశ్నించారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అప్పులు, అబద్ధాలు, అత్యాచారాలు, అతిశయోక్తులు, ఆడంబరాలు మాత్రమే కనిపిస్తున్నట్లు చెప్పారు. ఏడాది కాలంలో రూ.1,58,604 కోట్ల అప్పు చేసి ఆల్ టైమ్ రికార్డు సాధించిందని చెప్పారు. అబద్ధాలు చెప్పడంలో అగ్ర స్థానంలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. నిరుద్యోగభృతి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అమలు చేయలేదన్నారు. ఆడబిడ్డ నిధి కింద 19నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని ఇవ్వలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి దాన్ని కూడా తుంగలో తొక్కారని పేర్కొన్నారు. పాఠశాల విద్యలో జిఒ 85రద్దు చేస్తామని చెప్పి ఇప్పటివరకు చేయలేదని విమర్శించారు. ఈ ఏడాది కాలంలో మహిళలు, బాలికలపై 188 అత్యాచారాలు, అత్యాచార హత్యలు జరిగాయన్నారు. స్వర్ణాంధ్ర 2047 అంటూ రోజూ సిఎం అతిశయోక్తులు పలుకుతున్నట్లు విమర్శించారు.

ఉప ఖజానా అధికారిగా ప్రమీల

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు ఉప ఖజానా కార్యాలయ అధికారిగా ప్రమీల బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె అన్నమయ్య జిల్లా వాయల్పాడు మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. కార్యాలయం సీనియర్ అకౌంటెంట్‌గా చంద్ర, జూనియర్ అకౌంటెంట్‌గా ప్రసాద్‌రెడ్డి విధుల్లో చేరారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ప్రమీల మాట్లాడుతూ పెన్షనర్లు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లకు సంబంధించిన జీతాలు, బిల్లులు పెండింగ్ లేకుండా సకాలంలో అందేలా చూస్తామన్నారు. ఇక్కడ ఎస్‌టిఒగా పని చేస్తున్న డేవిడ్ కడప జిల్లా కార్యాలయానికి వెళ్లారు.

చెముల్లపల్లె, చెన్నముక్కపల్లెలో నేడు ఏరువాక

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని చెముల్లపల్లి, చెన్నముక్కపల్లె గ్రామాల్లో గురువారం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏరువాక కార్యక్రమం జరగనున్నట్లు మండల వ్యవసాయ అధికారి నాగార్చన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రైతులు, ప్రజాప్రతినిధులు తప్పక పాల్గొనాలన్నారు.

14న తవ్వారుపల్లెలో ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని తవ్వారుపల్లెలో ఈనెల 14న శనివారం శ్రీ భక్త వీరాంజనేయ స్వామి ఆలయ 8వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సందుల నాగశివారెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు. ఆ మేరకు బుధవారం వారు మాట్లాడుతూ ప్రత్యేకపూజ కార్యక్రమాలతోపాటు అన్న ప్రసాద వితరణ, గ్రామోత్సవం, బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.

రిటైర్డ్ విఆర్ఒ బాలసుబ్బారెడ్డి మృతి

ప్రజాశక్తి–ఖాజీపేట

మండల పరిధిలోని తవ్వారుపల్లె గ్రామానికి చెందిన రిటైర్డ్ విఆర్ఒ కాటయ్యగారి బాలసుబ్బారెడ్డి (78) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆయన పలు రెవెన్యూ గ్రామాల్లో గ్రామ రెవెన్యూ కార్యదర్శిగా పనిచేశారు. బాలసుబ్బారెడ్డి మృతదేహాన్ని పలువురు నాయకులు, అధికారులు సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు. వైసిపి నాయకులు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి బాలసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి నివాళులర్పించారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - వేంపల్లె

దోమల నివారణకు చర్యల్లో భాగంగా ఎసిఎం మందును పిచికారి చేయాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వసతిగృహాన్ని, ప్రభుత్వ బాలుర, బాలికల వసతి గృహాల్లో సిద్దయ్య ఆధ్వర్యంలో దోమల నివారణకు ఆల్ఫాసైపర్ మిత్రిన్ మందు పిచికారి చేశారు. జిల్లా మలేరియా అధికారి మనోరమా ఆదేశాల మేరకు పులివెందుల నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఉన్న ప్రభుత్వ వసతి గృహాల్లో మందు పిచికారి చేస్తున్నట్లు చెప్పారు. మలేరియా నివారణ మాసోత్సవాలు సందర్భంగా దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆల్ఫాసైపర్ మిత్రిన్ 10 నుండి 12 వారాల వరకు పని సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. స్ప్రే చేసిన ప్రదేశంలో దోమ వాలితే నిముషాల్లో చనిపోతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త భాస్కర్, వీర నాగమ్మ, ఆశా కార్యకర్త శైలజ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల వసతిగృహంలో మందు పిచికారి చేస్తున్న సిబ్బంది

రూ.12.98 కోట్లతో 228 పనులు ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి మైథిలి

మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ రకాల అభివృద్ధి పనుల కింద రూ.12.98 కోట్లతో 228 పనులు ప్రారంభిస్తున్నట్లు నియోజకవర్గ ప్రత్యేక అధికారి డిప్యూటీ సిఇఒ మైథిలి తెలిపారు. మైదు కూరు ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న ఎస్‌సిఆర్ కల్యాణ మండపంలో బుధవారం సుపరిపాలన–స్వర్ణాంధ్రప్రదేశ్ పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సం దర్భంగా స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సహకారంతో ఎంజిఎన్ఆర్‌జిఎస్, డిఎంఎఫ్, పిఎం జిఎస్‌వై ద్వారా నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుడుతుందన్నారు. ఆర్‌డిఒ చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రకాల సేవలను పారదర్శకంగా నిర్వహిస్తోందన్నారు. కార్యాలయాలకు వెళ్లకుండానే ఇంటి నుంచే పలు సేవలను పొందే అవకాశం కల్పించిందన్నారు. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఇంజనీర్ చంద్రశేఖర్, మైదుకూరు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, కేసీ కెనాల్ ప్రాజెక్టు వైస్ చైర్మన్ డి.గురివిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర, వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, టిడిపి పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, చాపాడు మండల శాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, వెంకట రమణారెడ్డి, సుబ్బారెడ్డి, భీమయ్య, కౌన్సిలర్ రాధాకృష్ణ, నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

పుస్తకాల పేరుతో వ్యాపారం.. పట్టని అధికారులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్

ప్రొద్దుటూరు పట్టణంలో కొన్ని ప్రయివేట్ పాఠశాలలు పుస్తకాల పేరుతో వ్యాపారం చేస్తున్నాయి. ఆయా పాఠశాలల యజమానులు తల్లి దండ్రులకు ఫోన్ చేసి ముందస్తుగానే పుస్తకాలు కొనుక్కోవాలని ఒత్తిడి తెచ్చి డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పాఠ్య పుస్తకాలు కొనాలనే పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్న ప్రయివేట్ పాఠశాలలో వారి విద్యాసంస్థ పేరుతో ముద్రించిన పాఠ్య పుస్తకాలను ముందే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఒత్తిడి చేస్తున్నారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, ఎల్‌కెజి, యుకెజి, నర్సరీ, పిల్లల బుక్స్ రూ. 3,000 నుంచి రూ.5000 వరకు అమ్ముతున్నారు. ఇక ఒకటవ తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్యపుస్తకాలు ఇంకెంత రేటు ఉంటాయో చూస్తుంటేనే భయమేస్తుంది. అంతేకాక వ్యాన్ ఫీజు, హాస్టల్ ఫీజు అంటూ ఒక్కో విద్యార్థి నుంచి రూ.లక్ష వరకు ఫీజు దందా జరుగుతోందనే ఆరోప ణలు న్నాయి. ఇప్పటినుంచే పేద కుటుంబాల పిల్లల తల్లిదండ్రులను ప్రయి వేట్ విద్యాసంస్థలు మంచి విద్య పేరుతో ఒత్తిడి చేసి మానసికంగా వేధిం చడం మొదలు పెట్టారని పలువురు వాపో తున్నారు. చదువు పేరుతో విద్యా ర్థులు, వారి తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారు. వేలు, లక్షల్లో ఫీజుల పేరుతో వసూలు చేస్తున్నా కొన్నేళ్లుగా ఆయా పాఠశాలల్లో విద్యా ర్థులకు సరైన వసతులు ఉండవని పలువురు ఆరోపిస్తున్నారు. ఎక్కడోచోట సం ఘటనలు జరుగుతూనే ఉన్నాయని పేర్కొంటున్నారు. అయినప్పటికీ సం బంధిత అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలు న్నాయి. వారికి విద్యాశాఖ అధికారులు కొమ్ము కాస్తున్నారనే ఆరో పణ లున్నాయి. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ఆయా విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరు తున్నారు.

ప్రారంభానికి మోడల్ ప్రైమరీ స్కూల్ ముస్తాబు

సింహాద్రిపురం : సింహాద్రిపురంలో మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రారంభానికి ముస్తాబైంది. ప్రభుత్వం మోడల్ ప్రైమరీ స్కూల్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో స్కూల్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. సింహాద్రిపురంలో ఆధునిక వసతులతో విద్యార్థులకు విద్యాబోధన అందించేలా మౌలిక వసతులను ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించండి

తల్లిదండ్రులకు ఎంఇఒ ఓబులేస్ సూచన

ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు విద్యను అందించనున్నారని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్చాలని ఎంఇఒ ఓబులేసు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మోడల్ ప్రైమరీ స్కూల్లో విద్యార్థులకు కావలసిన అన్ని వసతులు ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తే వారి ఉజ్వల భవిష్యత్తుకు భరోసా తాము ఇస్తామని ఆయన తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉండాలి

ఏరువాక కార్యక్రమంలో ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రతి రైతుకు, ప్రజలకు ప్రభుత్వం పథకాల గురించి అవగాహన ఉండాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. బుధవారం మైలవరం మండలం చిన్నకొమెర్ల గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, ఎండుమిరప కాయలకు కనీసం మద్దతు ధర పెంచామన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డుకు ఇచ్చే రుణం గతంలో కంటే ఇప్పుడు ఎక్కువ ఇవ్వనున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎ.నాగేశ్వరరావు మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు, వేరుశనగ విత్తనాలు 50 శాతం రాయితీతో రైతులకు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఎడిఎ, జమ్మల మడుగు, మైలవరం, పెద్దముడియం, కడప డిఆర్‌సి నుండి ఎడిలు, ఆర్ ఎస్‌కె అసిస్టెంట్లు, రైతులు, టుబిఎన్‌ఎఫ్ సిబ్బంది, కూటమి నేత చిన్న కొమెర్ల రామాంజనేయ రెడ్డి, సుధాకర్ రెడ్డి, చెన్నకేశవ రెడ్డి, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

చక్రాయపేట : ఖరీఫ్ సాగు మొదలు పెట్టే ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని ప్రకృతి వ్యవసాయం అధికారి ఆధ్వర్యంలో బుధవారం చిలేకంపల్లిలో ఘనంగా నిర్వహించారు. రైతు లక్ష్మీదేవి పొలంలో పిఎండిఎస్ బీజామృతంతో విత్తనశుద్ధి చేసి, ఘన జీవామతం చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేతలు, ఎపిసిఎన్‌ఎఫ్, టిపిఎం ప్రవీణ్‌కుమార్, వ్యవసాయాధికారి నవంత్ బాబు, ప్రతాప్ మాస్టర్ ట్రైనర్, ఎన్‌ఎఫ్‌ఎ నరసింహారెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చిలేకంపల్లిలో ఏరువాక పౌర్ణమిని ప్రారంభించిన జిల్లా అధికారులు

మేమే కాంగ్రెస్ పార్టీ సైనికులం

- షర్మిల నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నాం

ప్రజాశక్తి - కడప

మేమంతా కాంగ్రెస్ పార్టీ సైనికులం అని, షర్మిల నాయకత్వాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన మాజీ కార్యదర్శి ఎస్.ఎ. సర్దార్, డిసిసి మాజీ వైస్ ప్రెసిడెంట్ నాసిర్ హుస్సేన్, డిసిసి మహిళా అధ్యక్షులు శ్యామలమ్మ, మాజీ మైనారిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్రమ్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాసిర్ ఖాన్, మాజీ పిసిసి కార్య దర్శి– కర్నాటి చంద్రశేఖర్ రెడ్డి, అన్వర్, జాన్ బాషా, రత్నకుమారి అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత జగన్మోహన్‌రెడ్డి చేసిన నమ్మకద్రోహంతో పూర్తిగా వెనకబడిపోయింది అన్నారు. ఆ సమయంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి రావడంతో తిరిగి కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెస్తుంది అనుకుని ఆశపడ్డాం, స్వాగతించామని చెప్పారు. కానీ ఆమె తెలుగుదేశం పార్టీకి కోవర్టుగా పనిచేయడం, కాంగ్రెస్ పార్టీ నాయకులతో దూరంగా ఉంటూ తన కోటరీ ఏర్పాటు చేసుకున్నారని విమర్శించారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు పార్టీ సీనియర్ నాయకులను దూరం చేస్తూ వచ్చారని వాపోయారు. నిరంకుశ, నియంతృత్వ, మోసపూరిత విధానాలకు వ్యతిరేకంగా షర్మిల నాయకత్వాన్ని మార్పు చేయాలని డిమాండ్‌తో ఈనెల 12 న ఐఎంఎ హాలులో షర్మిల నాయకత్వంలో నిర్వహించే సమావేశాన్ని శాంతియుతంగా గాంధేయ మార్గంలో అడ్డుకుంటామని తెలియజేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దినేష్‌కుమార్

ప్రతి రైతుకూ సమాచారం అందించాలి

ప్రజాశక్తి - చక్రాయపేట

నూతన సాంకేతికత, ప్రభుత్వ పథకాలపై ప్రతి రైతుకూ సమాచారం అందించాలని నూనె గింజల పరిశోధన అధికారి డాక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం సురభి గ్రామం కుప్పంలో నిర్వహించిన రైతుల సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ నూనె గింజల నూతన వంగడాలు, వేరుశెనగ, నువ్వులు సాగు పంట యాజమాన్య పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, మానస (ఉద్యాన), మాధురి(తెగుళ్ల విభాగం), మహేష్ బాబు(విస్తరణ), గిరీష్ కుమార్(సూక్ష్మ జీవ శాస్త్రం), ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి ప్రవీణ్‌కుమార్, వ్యవసాయాధికారి నవంత్ బాబు, రైతులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలోని మెయిన్ బజారులో ఉన్న శ్రీబాలాజీ అనాథాశ్రమంలో బుధవారం వెంకట సుబ్బమ్మ పదవ వర్ధంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. వెంకటసుబ్బమ్మ భర్త చిన్న కొండప్ప మాట్లాడుతూ వర్ధంతి రోజున ప్రతి సంవత్సరం అన్నదాన కార్యక్రమం, వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనాథాశ్రమం నిర్వాహకురాలు ఎలిజిబెత్ రాణి మాట్లాడుతూ అన్నదానం, బట్టల దానం చేయడం చాలా గొప్ప విషయమన్నారు. ఇలాంటి సేవ కార్యక్రమాలకు అందరూ ముందుకు రావాలని కోరారు. అనాథలను చేరదీసి ఆశ్రమంలో మూడు పూటలా అన్నం పెడుతున్నామన్నారు. వారు ఇక్కడే ఉండేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో వెంకటసుబ్బమ్మ కుమారులు శ్రీనివాసులు, చిన్న కొండయ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గృహోపకరణాలు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

దివంగత డాక్టర్ వైఎస్ పురుషోత్తమరెడ్డి కుమారుడు మైఖేల్ రెండవ వర్ధంతిని పురస్కరించుకుని పురుషోత్తమరెడ్డి పెద్ద కుమారుడు డాక్టర్ వైఎస్ సత్యానందరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ముద్దనూరు రోడ్డులో ఉన్న విభిన్న ప్రతిభావంతుల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఫిలిప్, బ్రదర్ రఘుకర్ చేతుల మీదుగా 30 మందికి గృహోపకరణాలు పంపిణీ చేశారు. స్వీట్లు, పండ్లు అందజేశారు. దాతలకు ఎపి విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యదర్శి సునీల్, వాల్మీకి సంఘం నాయకులు అంబకపల్లె బాలుడు, బాలిరెడ్డి పాల్గొన్నారు.

టిడిపి జిల్లా ఉపాధ్యక్ష పదవికి రామగంగిరెడ్డి రాజీనామా

వేంపల్లె : మండలంలోని నందిపల్లె గ్రామానికి చెందిన రామగంగిరెడ్డి టిడిపి జిల్లా ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆ మేరకు బుధవారం ఆయన టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావుకు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డికి, పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవీంద్రనాథ్‌రెడ్డికి రాజీనామా పత్రాన్ని పంపించారు. 2023లో తనపై ఉన్న నమ్మకంతో టిడిపి జిల్లా ఉపాధ్యక్ష పదవిని బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి ఇచ్చారని తెలిపారు. అందుకు టిడిపికి కృతజ్ఞతలు అన్నారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తన రాజీనామాను ఆమోదించాలని కోరారు. ఇకనుండి తాను ఒక సామాన్య టిడిపి కార్యకర్తగా ఉంటూ పార్టీ అభివృద్ధికి పనిచేస్తానని రామగంగిరెడ్డి తెలిపారు.

క్రైం కార్నర్

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

సెల్‌ఫోన్ చూడొద్దని తల్లిదండ్రులు మందలించినందుకు..

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఆత్మహత్య చేసుకున్న పవన్‌కుమార్

పట్టణంలోని ప్రకాష్ నగర్ కాలనీలో బీటెక్ చదువుతున్న ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. దాసరి సుధాకర్ కుమారుడు పవన్ కుమార్ ప్రొద్దుటూరు సిబిఐటి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుకుంటున్నాడు. కొడుకును అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న తల్లిదండ్రులు సెల్‌ఫోన్ ఎక్కువగా చూడవద్దని, సమయం వృథా చేసుకోవద్దని, బాగా చదువుకోవాలని మందలించారు. ఇందుకు మనస్తాపం చెందిన పవన్‌కుమార్ మంగళవారం రాత్రి తల్లిదండ్రులను బయట పడుకోవాలని తాను ఇంట్లో నిద్రిస్తానని చెప్పాడు. తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుని దాసరి పవన్‌కుమార్ (20) ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గురుశంకర్ రెడ్డి సంఘటనాస్థలాని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల రోదనతో ప్రకాష్‌నగర్ కాలనీలో విషాదం అలుముకుంది.

ఖాజీపేట తహశీల్దార్‌గా రమణమ్మ

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట తహశీల్దార్‌గా ఎవి రమణమ్మ రానున్నారు. ఆమె ఒంటిమిట్టలో పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. త్వరలోనే ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక్కడ పని చేస్తున్న తహ శీల్దార్ మహబూబ్ బాషా ను జమ్మలమడుగు ఆర్‌డిఒ కార్యాలయానికి బదిలీ చేశారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన జూనియర్ సివిల్ జడ్జీ : లక్కిరెడ్డి పల్లె

O.S.No. 106/2024

సిబ్యాల గంగయ్య తండ్రి రామయ్య, వయస్సు 65 సం, నివాసం వడ్డేపల్లి H/o నూలివీడు గ్రామం, గాలివీడు మండలం, అన్నమయ్య జిల్లా. ...వాది

V/s

షేక్ ఖాజా, తండ్రి రసూల్, వయస్సు 50 సం,నివాసం డోర్ నెంబర్.14/98, బజారు వీధి , కడప టౌన్ మరియు జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి దావా నోటీసు

పై నెంబర్ యొక్క దావా నందు వాది అయన గంగయ్య గారు ప్రతి వాది అయన మీ పైన కోర్ట్ నందు ప్రోనోటే దాఖలు చేసి ఉన్నారు. శ్రీ కోర్ట్ వారు తేది9-7-2025 ఉదయం 10.30 గం, పై కోర్ట్ నందు వాయిద ఉన్నది. మీరు కాని మీ తరుపున వకీలు గారి ద్వార గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట మీ పైన పరోక్షంగా తీర్మానించ బడును అని తెలుపడమైనది.

//కోర్ట్ ఉత్తర్వ మేరకు//

వేల్పుల సిద్దయ్య(సిద్దూ),
న్యాయవాది
రాయచోటి, లక్కిరెడ్డి పల్లె
సెల్ 9985169067,8500620229

మహారాజశ్రీ కడప వెకేషన్ జడ్జి కోర్టు (మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు)

I.P.No. 01/2025

గడ్డం కళ్యాణ్ చక్రవర్తి, S/o జి.వి.రమణ, వయసు 46 సం॥, వ్యాపారం, హిందు, నివాసం, డోర్ నెం.28/273, రామేశ్వరం, ప్రొద్దుటూరు గ్రామం, కడప జిల్లా. ...పిటీషనర్

Vs

1. గునిశెట్టి వెంకట సుబ్బమ్మ, W/o గునిశెట్టి చిన్న సుబ్బరాయుడు, వయసు 65 సం॥, నివాసం, భావనారుషి గుడి వెనుకల, ఆర్ట్స్ కాలేజీ రోడ్డు, శ్రీరామ్‌నగర్, ప్రొద్దుటూ రు టౌన్, కడప జిల్లా & 12 Others. ...రెస్పాండెంట్స్

జనరల్ నోటీస్

పై నెంబర్ పిటీషనర్ అయిన జి.కళ్యాణ్ చక్రవర్తి పై కోర్టులో రెస్పాండెంట్స్ అయిన మీ పైన ఐ.పి.ని దాఖలు చేసి ఉన్నారు. అట్టి ఐ.పి. యందు పిటీషనర్ రూ.5,05,000/- అప్పుగా చూపించి ఉన్నారు. అట్టి ఐ.పి. యందు మీకు ఎవరికైన ఆక్షేపణలు వున్న యెడల పై కోర్టు యందు 24.06. 2025వ తేదీన, ఉదయం 10.30 ని॥ హాజరుకావలెను. లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.

వాయిదా తేది: 24.06.2025

T. PADMAJA
Advocate,
Proddatur

మహారాజశ్రీ కడప వెకేషన్ జడ్జి కోర్టు (మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు)

I.P.No. 02/2025

గెంటెన వెంకట చంద్ర, S/o రమణయ్య, వయస్సు 44 సం॥, హిందు, నివాసం, డోర్‌నెం.1/107, ఏకోపల్లిపల్లె, ఏనుకుపల్లి పోస్ట్, దువ్వూరు మండలం, కడప జిల్లా. ...పిటీషనర్

Vs

దొంత వెంకటేశ్వర్లు, S/o పెద్ద కొండయ్య, వయస్సు 50 సం॥, హిందూ, నివాసం ఏకోపల్లిపల్లె, ఏనుకుపల్లి పోస్ట్, దువ్వూరు మండలం, కడప జిల్లా & 17 Others. ...రెస్పాండెంట్స్

జనరల్ నోటీస్

పై నెంబర్ పిటీషనర్ అయిన జి.వెంకట చంద్ర పై కోర్టులో రెస్పాండెంట్స్ అయిన మీ పైన ఐ.పి.ని దాఖలు చేసి ఉన్నారు.అట్టి ఐ.పి. యందు పిటీషనర్ రూ.22,54,000/- అప్పుగా చూపించి ఉన్నారు. అట్టి ఐ.పి. యందు మీకు ఎవరికైన ఆక్షేపణలు వున్న యెడల పై కోర్టు యందు 24.06. 2025వ తేదీన, ఉదయం 10.30 ని॥ హాజరుకావలెను. లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.

వాయిదా తేది: 24.06.2025

G. BALA VENKATAIAH
Advocate, Mydukur.

IN THE COURT OF THE HON'BLE IIIRD. ADDITIONAL JNIOR CIVIL JUDGE: KADAPA

I.A.No. /2025
E.P.NO.08/2025
O.S.NO.292/2023

1) Dudekula Mahaboob Bee, W/o. late.D. Hussaian, aged about 65 of years, Dudekua, House-wife (Retired employee), resident D.No.1/2489, Housing Board Colony, Yerramukkapalli (post), Kadapa (town & city), YSR-Kadapa (Distict). ...Petitioner/D.Hr.

Vs

1) D. Rafi, S/o. D. Pichaiah, aged about 45 years, Private employee, Dudekula, resident of D.No. 88/84-1, Angadi Street, C.K.Dinne (Mandalam), Mamillapalli Rural, Kadapa (Town)YSR-Kadapa (District). ...Respondent/JDr.

NOTICE

Whereas the petitioner/Decree holder filed the above EXECUTION PETITION Before the Hon'ble IIIrd Additional Junior Civil Judge, Kadapa and the same is posted for your appearance on 30-06-2025, they are hereby directed to appear before the Hon'ble Court at 10-30 am in person or through your counsel, otherwise the petition may be decided in your absence.

//By Order of the Court//

B. VIJAYA KUMAR, B.A., B.L.
Advocate & Notary,
#1-422-1-1C, Maruthi nagar,
KADAPA (Town&City).
Cell: 8639056975.